

యూరియా కొరత

రబీ సీజన్‌ను యూరియా కొరత వెంటాడుతోంది. మొత్తం 3,800 టన్నులు ఉందని అధికారులు చెబుతున్నా ఎక్కడా ఒక్క బస్తా కూడా దొరకడం లేదు.

10లో▸



వలస బండ్లు కదులుతున్నాయ్!

జిల్లా పశ్చిమ ప్రాంతంలో వలసలు మొదలయ్యాయి. బతుకుదెరువు కోసం పల్లెల నుంచి ప్రజలు బడి పిల్లలతో సహా దూర ప్రాంతాలకు తరలి వెళ్తున్నారు.

10లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,625.78
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:79.099
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:6,921
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:10,223

బీమాను 'చంపేశారు'!

దయనీయం



ఈ చిత్రంలో కనిపించే మహిళ పేరు చాంద్‌బేగం. తుగ్గలి మండలం హుసేనాపురం గ్రామానికి చెందిన ఈమె భర్త కాశీంవలి(50) ఆరు నెలల క్రితం అనంతపురం జిల్లా గుత్తి రైల్వే స్టేషన్ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. ఇంటికి ఆధారమైన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబం పరిస్థితి దయనీయంగా మారింది. నిబంధనల మేరకు ఈ కుటుంబానికి రూ.10 లక్షలు సాయం అందాలి. బాధితురాలికి వితంతు పింఛన్ ఇవ్వాలి. అయితే ఇవేమీ అందలేదు. ఈమె పడుతున్న కష్టాలు అన్నీఇన్నీ కావు.



చంద్రన్న బీమా..లేదు ధీమా

- 17 నెలల్లో ఉమ్మడి జిల్లాలో 2,446 మంది మృతి
- వీరిలో ప్రమాద మృతులు 151 మంది
- ఇచ్చిన హామీ మేరకు ప్రమాద మరణాలకు రూ.10 లక్షలు.. సాధారణ మరణాలకు రూ.5 లక్షలు ఇవ్వాలి
- ఇప్పటి వరకు ఒక్క కుటుంబానికీ దక్కని భరోసా
- గత ప్రభుత్వంలో వైఎస్సార్ బీమాతో పేదలకు ఎంతో మేలు
- అప్పట్లో క్రమం తప్పకుండా సాయం అందజేత

గుంతలు పడిన రోడ్లు.. వేగంగా దూసుకొచ్చే వాహనాలు.. వణికిస్తున్న డెంగీ జ్వరాలు.. అకస్మాత్తుగా లయతప్పుతున్న గుండెలు.. ప్రజల పరిస్థితి దినదిన గండంగా మారింది. ఎప్పుడు ప్రమాదం సంభవిస్తుందో, ప్రబలుతున్న రోగాలతో ప్రాణం ఉంటుందో లేదో తెలియని దుస్థితి. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో మృతుల కుటుంబాలకు 'చంద్రన్న బీమా' భరోసా ఇవ్వలేకపోతోంది. కుటుంబ పెద్ద అకాల మృతితో ఇంటిల్లిపాది రోడ్డున పడాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 17 నెలలు అయినా ఈ పథకం కింద కనీసం దరఖాస్తులు స్వీకరించలేని దౌర్భాగ్యం నెలకొంది.

కర్నూలు(అగ్రికల్చర్): రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలకు చరమగీతం పాడి పేద, మధ్య తరగతి ప్రజల ఇళ్లల్లో సంక్షోభాన్ని తీసుకొచ్చింది. గతంలో ఉన్న వైఎస్సార్ బీమా పథకాన్ని చంద్రన్న బీమాగా పేరు మార్చి అమలు చేయకపోవడం ఇందుకు నిదర్శనంగా నిలిచింది. చంద్రన్న బీమా పథకం కింద సహజ మృతికి రూ.5 లక్షలు, ప్రమాదవశాత్తూ మృతి చెందితే రూ.10 లక్షలు అందచేస్తామని ఎన్నికల ప్రచారంలో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన, బీజేపీ నేతలు కూడా చెప్పారు. అయితే మృతి చెందిన కుటుంబాల నుంచి ఈ పథకం కింద దరఖాస్తులు స్వీకరించేందుకు మార్గదర్శకాలను ఇప్పటి వరకు విడుదల చేయలేదు. బీమా ఆర్థిక సాయం అందక బాధితులు కన్నీటితో 'అంతా మాయ చేశారు' అని ఆరోపిస్తున్నారు.

ప్రస్తుత ప్రభుత్వం ఏం చేసిందంటే..

సామాన్య, మధ్య తరగతి ప్రజలు మృతి చెందినా ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు మాత్రం పెద్దపీట వేసింది. కోటి మందికిపైగా టీడీపీ సభ్యత్వం కల్పించింది. వారికి రూ.5 లక్షలతో టీడీపీ తరఫున ప్రమాద బీమా కూడా కల్పించింది. టీడీపీ కార్యకర్తలకు ఇచ్చిన విలువ సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు ఇవ్వకపోవడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. తమకు పార్టీ కార్యకర్తలే ముఖ్యం.. సామాన్య, మధ్య తరగతి ప్రజలు కాదని టీడీపీ నిరూపించుకున్నట్లు అయిందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

వేనవేల వేదనలు!

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 2024 జూన్ 12న ఏర్పాటైంది. ప్రభుత్వం ఏర్పాటై 17 నెల నడుస్తున్నా చంద్రన్న బీమా హామీ అమలుపై దృష్టి సారించిన దాఖలాలు లేవు. సాధారణంగా 18 నుంచి 50 ఏళ్ల వారు మృతి చెందితే, అలాగే ప్రమాదాల్లో 18 నుంచి 70 ఏళ్ల లోపు వారు మృతి చెందితే ఈ పథకానికి అర్హులు. గత ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకు కర్నూలు జిల్లాలో 1,256 మంది, నంద్యాల జిల్లాలో 1,190 మంది సాధారణంగా మృతి చెందారు. ప్రమాదాల్లో కర్నూలు జిల్లాలో 72, నంద్యాల 79 మంది మృతి చెందారు. కుటుంబానికి ఆధారమైన వారిని పోగొట్టుకున్న ఎన్నో కుటుంబాలు చంద్రన్న బీమా పథకం కింద పరిహారం వస్తుందనుకున్నారు. అయితే కూటమి ప్రభుత్వం సామాన్య, మధ్యతరగతి ప్రజల మృతులను పట్టించుకోలేదు. ఇంటికి ఆధారమైన వారిని పోగొట్టుకొని, ప్రభుత్వం నుంచి చేయూత కరువై వేలాది కుటుంబాలు వీధిన పడ్డాయి.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇలా..

గత వైఎస్సార్‌సీపీ హయాంలో పేద బడుగు, బలహీన వర్గాల కుటుంబాల్లో 18 నుంచి 50 ఏళ్లలోపు వారు, 50 నుంచి 60 ఏళ్లలోపు వారు మృతిచెందితే రూ.లక్ష నుంచి రూ.ఐదు లక్షల వరకు బీమా సొమ్ము మంజూరయ్యేది. మృతి చెందిన వెంటనే వలంటీర్లు, గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది మృతుడి ఇంటికి వెళ్లి అంత్యక్రియల కోసం తక్షణ సాయంగా రూ.10 వేలు అందించేవారు. మిగతా సొమ్ము 15 నుంచి 20 రోజుల్లో నామిని బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేది. బీపీఎల్ కుటుంబాలకు చెందిన వారు అర్హులు కావడంతో ప్రభుత్వమే పూర్తి ప్రీమియం చెల్లించింది. అప్పట్లో కేంద్ర ప్రభుత్వం, ఇన్సూరెన్స్ కంపెనీలు సహకరించకపోయినా పూర్తిగా ఈ పథకాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అమలు చేసింది. రైస్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ఈ పథకం అమలు అయ్యింది.

అప్పటి పరిస్థితులు పునరావృతం

టీడీపీ పాలనలో 2014 నుంచి 2019 వరకు వేలాది మంది మృతి చెందినప్పటికీ చంద్రన్న బీమా ఉన్న వారికి పరిహారం రాలేదు. బీమా ఉన్న వారు మృతి చెందితే వారి వారసులు పరిహారం పొందాలంటే ఏళ్లుగడిచేవి. బాధిత కుటుంబ సభ్యులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అప్పట్లో బాధిత కుటుంబాల్లో 20 శాతం మంది కూడా బీమా దక్కలేదు. ప్రస్తుతం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యింది. సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు దోహదపడే చంద్రన్న బీమా అమలును పూర్తిగా పక్కన పెట్టడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 12.38 రైస్‌కార్డులు ఉండగా... వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 10.25 లక్షల కటుంబాలకు వైఎస్సార్ బీమా కల్పించింది. కూటమి ప్రభుత్వం మాత్రం చంద్రన్న బీమాను ఇంతవరకు పట్టించుకోలేదు.

వెబ్ సైట్‌ను మూసివేసి

చంద్రన్న బీమా పథకాన్ని డీఆర్‌డీఏ అమలు చేస్తుంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడమే మొదలు సాధారణ, ప్రమాద మృతుల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది. ఇందుకు సంబంధించిన వెబ్ సైట్‌ను పూర్తిగా మూసివేశారు. నిబంధనల ప్రకారం బీమా ఉన్న వ్యక్తి మృతి చెందితే 24 గంటల్లో రూ.10 వేలు చెల్లించాల్సి ఉంది. మృతుల కుటుంబాలు దుర్భర జీవితం గడుపుతున్నా.. ప్రభుత్వానికి చీమ కుట్టినట్లుగా కూడా లేదు.

న్యూస్‌రీల్

వైభవంగా పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్: నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి పల్లకీ సేవ కార్యక్రమం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం జరిపించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో అధిష్టింపజేశారు. పల్లకీ సేవా కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారి ఆలయాన్ని నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దర్శించుకున్నారు. పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగంలో ముగ్గురికి స్థానం

బొమ్మలసత్రం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగంలో నందికొట్కూరుకు చెందిన ముగ్గురికి స్థానం కల్పిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. స్టేట్ స్టూడెంట్ వింగ్ కమిటీ జనరల్ సెక్రటరీగా నందికొట్కూరుకు చెందిన కె.మాధురిగౌడ్, సెక్రటరీగా కుందన రాజశేఖర్‌గౌడ్, స్టేట్ మైనార్టీ సెల్ కమిటీ సెక్రటరీగా షేక్ మహమ్మద్ అబ్దుల్‌జఫార్‌లను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రతిభను వెలికి తీసేందుకు యువజనోత్సవాలు

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



యువజనోత్సవ పోటీల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నంద్యాల: యువతలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు యువజన ఉత్సవాల పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపా. జిల్లా యువజన సంక్షేమ శాఖ–సెట్కూరు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలకు సంబంధించి పోస్టర్‌ను శుక్రవారం తన చాంబర్‌లో జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోటీల్లో 15 నుంచి 29 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతీ యువకులు పాల్గొనవచ్చన్నారు. ఈ నెల 29న నంద్యాల రామకృష్ణ డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి యువజనోత్సవ పోటీలు ఏడు విభాగాల్లో నిర్వహిస్తామని చెప్పారు. సెట్కూరు సీఈఓ డాక్టర్ కె. వేణుగోపాల్ మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన విజేతలు రాష్ట్ర స్థాయికి, రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన వారు జాతీయ స్థాయికి ఎంపికవుతారని తెలిపారు. పూర్తి వివరాలకు మొబైల్ నంబర్లు 9292207601, 8328181581లను సంప్రదించవచ్చన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్ రెడ్డి, ఇంటర్మీడియట్ విద్యాధికారి శంకర్ నాయక్, స్కిల్ డెవలప్మెంట్ అధికారి శ్రీకాంత్ రెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బయ్య, సెట్కూరు పర్యవేక్షణ అధికారి శ్యామ్ బాబు పాల్గొన్నారు.

'నంద్యాల శనగ'తో అధిక దిగుబడులు



శనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): నంద్యాల గ్రామ్ 776 శనగ రకం సాగుతో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ జాన్సన్ తెలిపారు. అఖిల భారత రబీ అపరాల(శనగ) సమన్వయ పరిశోధనా పథకం కింద షెడ్యూల్ కులాల ఉపప్రణాళిక– ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రాల నిర్వహణలో భాగంగా శుక్రవారం ఓర్వకల్లు మండలం ఉప్పలపాడు గ్రామ ఎస్సీ రైతులకు నంద్యాల గ్రామ్ 776 శనగ రకంతో విత్తనశుద్ధి మందులను పంపిణీ చేశారు. స్థానిక కార్యాలయలలో జరిగిన కార్యక్రమంలో ఏడీఆర్ జాన్సన్ మాట్లాడుతూ.. ఎండుతెగులును తట్టుకొనే నంద్యాల గ్రామ్ 776 శనగ రకం జీవన శిలీంధ్ర నాశినిలతో విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. సరైన సమయంలో ఇచ్చిన పురుగు మందులు, శిలీంధ్ర నాశినిలను వినియోగించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ చెన్నయ్య, శనగ శాస్త్రవేత్తలు నీలిమ, మంజునాథ్, చైతన్య పాల్గొన్నారు.



కోటి సంతకాల సేకరణలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

'కోటి' శంఖారావం

ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తూ పేద విద్యార్థులకు వైద్య విద్యను కూటమి సర్కార్ దూరం చేస్తోందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణతో ఉద్యమ శంఖారావం పూరించామన్నారు. కర్నూలులోని వీకర్‌సెక్షన్ కాలనీలో శుక్రవారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. – కల్లూరు

నెల రోజులుగా నీటి సరఫరా తగ్గింపు

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి నెల రోజుల నుంచి నీటి సరఫరాను తగ్గించినట్లు అధికారులు తెలిపారు. ఇప్పట్లో నీటిసరఫరాను పెంచే అవకాశాల్లేవని పేర్కొన్నారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నాల్గోగేటు, ఎస్‌సీఎల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నుంచి 6,500 క్యూసెక్కుల నీటిని ఎస్సార్బీసీ కాల్వలోకి విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ఈ నీటిని బానకచర్ల నీటి నియంత్రణ వ్యవస్థ నుంచి తెలుగుగంగ కాల్వకు 6 వేల క్యూసెక్కులు, కేసీ ఎస్కేప్ కాల్వకు 300, జీఎన్ఎస్ఎస్(ఎస్సార్బీసీ) కాల్వకు 200 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు బానకచర్ల ఏఈ దేవేంద్ర తెలిపారు.



పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్

టీడీపీ ముఖ్య నేతలే నకిలీ మద్యం వ్యాపారులు

- మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్: రాష్ట్రంలో చలామణి అవుతున్న నకిలీ మద్యం మూలాలు టీడీపీ ప్రభుత్వంలోని ముఖ్య నాయకుల వేనని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శుక్రవారం డోన్‌లోని తన స్వగృహంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బుగ్గన మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం, ములకల చెరువులలో కల్తీ లిక్కర్ డెన్‌లు గుర్తించినప్పుడే బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోకుండా కేసులు పక్కదారి పట్టించేందుకు కూటమి ప్రభుత్వం కుటిల యత్నాలు చేస్తోందన్నారు. ఏకకాలంలో రాష్ట్రవ్యాప్తంగా బెల్టు షాపులపై దాడులు నిర్వహించి నకిలీ మద్యం తయారీ మూలాలను కనుగొనడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. గురువింద గింజ తన కింది నలుపు ఎరగదన్నట్లు కల్తీ మద్యం కేసులో నిందితులందరూ టీడీపీకి చెందిన వారే కాగా, దురుద్దేశ్య పూర్వకంగా ఆ నిందను వైఎస్సార్‌సీపీ నాయకులకు అంటగట్టాలని చూస్తున్నారన్నారు. గతంలో పాలకొల్లు, ఏలూరు, పరవాడ ప్రాంతాల్లో దొరికిన కల్తీ మద్యం ఎవరిదనే విషయాన్ని బయటకు పొక్కనివ్వకుండా అధికార పార్టీ నేతలు కప్పిపుచ్చిన సంగతిని ప్రజలు మరిచిపోలేదన్నారు.

ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలి

కూటమి ప్రభుత్వంలో అన్ని చోట్ల టీడీపీ నేతలు అవినీతి చేస్తున్నారని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆరోపించారు. గత ప్రభుత్వంలో ప్రారంభమైన అభివృద్ధి పనులు చేస్తున్న కాంట్రాక్టర్లను బెదిరించి టీడీపీ నేతలు మామూళ్లు వసూలు చేస్తున్నారన్నారు. ఇప్పటికే ఆరోగ్య శ్రీ పథకాన్ని కూటమి ప్రభుత్వం నీరుగార్చిందన్నారు. పేద విద్యార్థులకు ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలుచేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. రైతాంగంతో పాటు అట్టడుగు నిరుపేద వర్గాలు, అల్ప సంఖ్యాకుల వర్గాలకు ఒరిగిందేమీ లేదన్నారు. మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి, జననేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను అమలుచేయడం తప్ప కూటమి ప్రభుత్వం పేదల కోసం ఫలానా పని చేశామని గొప్పలు చెప్పుకునేందుకు ఏమీ లేదన్నారు. కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలన్నీ ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టే కుట్ర జరుగుతోందన్నారు. ఇదే జరిగితే నిరుపేదలకు వైద్యం ఉచితంగా అందే అవకాశం ఉండబోదన్నారు. ఇలాంటి ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రజలు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు.

పాల్గొన్న పార్టీ నాయకులు

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకులు దేశం సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు సోమేష్ యాదవ్, మల్లికార్జునరెడ్డిల అధ్యక్షతన కోటి సంతకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీలు బుగ్గన నాగభూషణంరెడ్డి, రేగటి రాజశేఖర్ రెడ్డి, దిలీప్ చక్రవర్తి, మున్సిపల్ చైర్మన్‌లు సప్తశైల రాజేష్, చలంరెడ్డి, పార్టీ వాలెంటీర్ విభాగం జిల్లా అధ్యక్షులు పోస్టుప్రసాద్, ఉపాధ్యక్షులు కురుకుంద హరి, బొబ్బల శివరామిరెడ్డి, బుగ్గన జయచంద్రారెడ్డి, మల్యాల శ్రీనివాసరెడ్డి, దినేష్‌గౌడ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శులు పొలుట్ల రఘురాం, రఘు, జెడ్పీటీసీలు బద్దల రాజ్‌కుమార్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్‌లు మల్యాల రామచంద్రుడు, బోరెడ్డి పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి మొండి చేయి చూపారు!

- అభివృద్ధిపై ఒక్క మాట కూడా మాట్లాడలేదు
- నిధులు రాబట్టడంలో టీడీపీ నేతలు విఫలం
- మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురువారం శ్రీశైలంలో పర్యటించడంతో నిధులు వరదలా వస్తాయని ఆశించామని, అయితే శ్రీశైలానికి మొండి చేయి చూపించారని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. శ్రీశైలం ప్రాజెక్ట్‌లోని ఏపీ జెన్‌కో అతిథి గృహంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శిల్పా మాట్లాడుతూ.. శ్రీశైలంలో ప్రధాని పర్యటన అనగానే అభివృద్ధికి మహర్దశ పడుతుందని భావించామన్నారు. అయితే శ్రీశైలం పర్యటనలో ప్రధాని మోదీ నోట అభివృద్ధి మాట రాకపోవడంతో నిరాశకు గురయ్యామన్నారు. నిధులు రాబట్టడంలో టీడీపీ నేతలు విఫలం అయ్యారని, అలాగే శ్రీశైల ప్రాంతంలో ఉన్న సమస్యల పరిష్కారానికి హామీ కూడా పొందలేకపోయారన్నారు. ప్రశ్నిస్తాననే రాష్ట్ర అటవీశాఖ మంత్రి పవన్ కళ్యాణ్ నోరు మెదపలేదన్నారు. గతంలో కేంద్ర మంత్రి అమితాషా శ్రీశైలం పర్యటనకు రాగా.. తాము శ్రీశైలం అభివృద్ధి, రైల్వేలైన్, దోర్నాల నుంచి శ్రీశైలం, ఆత్మకూరు రోడ్ల విస్తరణ, దోర్నాల నుంచి శ్రీశైలం ఎలివేషన్ కారిడార్, శ్రీశైలం–సున్నిపెంట స్ప్రింగ్‌బ్రిడ్జ్ తదితర ప్రతిపాదనలు తీసుకువచ్చామన్నారు. ప్రధాని మోదీ శ్రీశైలానికి వస్తే బీజేపీ మండల నాయకుడు చదువుల శ్రీనుకు అపాయింట్‌మెంట్ ఇచ్చి, స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డికి ఇవ్వకపోవడం చూస్తుంటే ఆయన స్థాయి ఎంతకు దిగజారిందో అర్థమవుతోందన్నారు. ట్రస్ట్ బోర్డ్ సభ్యుల నియామకంలో బుడ్డా ప్రాధాన్యత ఏమిటో తెలిసిపోయిందన్నారు. ప్రమాణ స్వీకారానికి ఆయనకు ఆహ్వానం లేకపోవడం చూస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు దగ్గర ఎన్ని మార్కులు ఉన్నాయో ప్రజలకు అర్థమవుతోందన్నారు. శ్రీశైలం అభివృద్ధి కోసం కాకుండా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి తన అనుచరుల కోసం పనిచేస్తున్నారని శిల్పా ఆరోపించారు. ఇసుక, ఇటుక, మద్యం దుకాణాలు, బెల్ట్‌షాపులు, దేవస్థానంతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల్లో లంచాలు, సున్నిపెంటలో భూముల కబ్జాలపైన ప్రతిరోజు తీరిక లేకుండా ఉన్నారని విమర్శించారు. 'దేవస్థానానికి స్వయంగా నేను కాటేజీ కట్టిస్తున్నానని, ఇందుకు ఇసుక లారీలను పంపిస్తే వాటిని బుడ్డా తన అనుచరుల చేత ఆపిస్తున్నారని, కప్పం కట్టాలని ఆదేశాలు జారీ చేస్తున్నారని, వసూల్ కింగ్‌గా మారారేమో' అని శిల్పా అన్నారు. సున్నిపెంటలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వట్టి వెంకటరెడ్డిని ఇబ్బంది పెట్టాలని ఎమ్మెల్యే చూస్తున్నారని, డిజిటల్ బుక్‌లో నోట్ చేసుకుని, అధికారంలోకి వచ్చాక వదిలి పెట్టబోమని హెచ్చరించారు. శ్రీశైలంలో అభివృద్ధి పేరిట శివాసదనం, పెద్ద సత్రంలను పడగొట్టినప్పటికీ అక్కడి నివాసితులకు శ్రీశైలంలోనే నివాసాలను కల్పించాలని శిల్పా డిమాండ్ చేశారు.



మిరప.. జీవాలకు మేత



గంగవరంలో మిరప పంటలో గొర్రెలు మేస్తున్న దృశ్యం



రైతు జయరామిరెడ్డి

కాసులు కురిపిస్తుందని మిరప సాగు చేసిన రైతుల ఆశలపై వరుణుడు నీళ్లు చల్లాడు. గత 20 రోజులుగా కురిసిన భారీ వర్షాలకు పంట దెబ్బతినడంతో నష్టం అంతా ఇంతా కాదు. నందవరం మండలంలో 1,360 ఎకరాల్లో మిరప సాగైంది. అతివృష్టి కారణంగా మిరప చేతికందే పరిస్థితి లేదు. రైతులు చాలా చోట్ల పంటను దున్నేశారు. కొందరు జీవాలకు మేతగా వదిలేశారు. గంగవరం గ్రామానికి చెందిన రైతు జయరామిరెడ్డి దాదాపు రూ.4 లక్షల పెట్టుబడితో తొమ్మిదిన్నర ఎకరాల మిరప సాగు చేశాడు. భారీ వర్షాలతో పంటలో నీరు నిలిచి మొత్తం కుళ్లిపోయింది. ఇక చేసేది లేక శుక్రవారం గొర్రెలకు మేతగా వదిలేశాడు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

– నందవరం

దారంతా గుంతలు..



గుంతల మయంగా మారిన బోయబొంతిరాళ్ల - బొందిమడుగుల రహదారి

కృష్ణగిరి: ప్రధాన గ్రామాల మధ్య రహదారులు పూర్తిగా ధ్వంసమై వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. భారీ వర్షాలకు తోడు పరిమితికి మించి లోడుతో వాహనాలు వెళ్తుండటంతో రహదారులు ఛిద్రమవుతున్నాయి. ఈ దారుల్లో ప్రయాణించాలంటే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. బోయబొంతిరాళ్ల నుంచి బొందిమడుగుల వెళ్లే రహదారి పూర్తిగా గుంతలమయంగా మారింది. ఆగవేళి నుంచి సంగాలకు వేళ్లే దారి కూడా అడుగడుగునా గుంతలు దర్శమిస్తున్నాయి. ఎస్‌హెచ్ ఎర్రగుడి కృష్ణగిరి వచ్చే రహదారిలో నిత్యం అక్రమంగా ఇసుక తరలిస్తుండటంతో రహదారి పూర్తిగా పాడయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ రహదారులకు మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వలస బండ్లు కదులుతున్నాయ్!





పల్లెపాడు నుంచి బొలెరో, లారీలలో వలస వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న కూలీలు

కోసిగి: జిల్లా పశ్చిమ ప్రాంతంలో వలసలు మొదలయ్యాయి. బతుకుదెరువు కోసం గత పది రోజులుగా పల్లెల నుంచి జనం వరుస కట్టి వెళ్లిపోతున్నారు. శుక్రవారం కోసిగి మండంలోని పల్లెపాడు గ్రామంలోనే 8 బొలెరోలు, రెండు లారీలలో 1000 మంది దాకా మూటా ముల్లె సర్దుకుని తెలంగాణ ప్రాంతానికి తరలి వెళ్లారు. బడికి వెళ్లే పిల్లలను బడి మానిపించి తమ వెంటనే తీసుకెళ్లాల్సి వచ్చింది. గ్రామంలో ఉంటే బతకడం కష్టంగా మారుతోందని, వలస వెళ్లి అక్కడ పనులు చేసుకుని నాలుగు డబ్బులు సంపాదించుకుంటామని కూలీలు తెలిపారు. ఏటా గ్రామం విడిచి వెళ్లక తప్పదని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వలసలు నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కూలీలు కోరారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు



గాయపడిన ఉమాదేవి

గడివేముల: నంద్యాల– నందికొట్కూరు ప్రధాన రహదారిలోని గడివేముల సమీపంలోని గోడౌన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఓర్వకల్లు మండలం హుస్సేనాపురం గ్రామానికి చెందిన ఆంజనేయులు, భార్య ఉమాదేవి బైకుపై బండిఆత్మకూరు మండలం ఏ కోడూరులో ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. అనంతరం తిరిగి వస్తుండగా గడివేముల సమీపంలోని గోడౌన్ వద్ద భారీ లారీ వస్తుండటంతో ఆంజనేయులు బైక్‌ను అదుపు చేయలేక కింద పడ్డారు. వెనుక కూర్చున్న ఉమాదేవి చేయిపై లారీ టైరు ఎక్కడంతో నుజ్జునుజ్జు కావడంతో పాటు టైరు ముఖానికి తాకడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108లో నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. గడివేముల ఇరుకురోడ్లలో భారీ వాహనాలు అధికంగా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు విమర్శిస్తున్నారు.

ఏపీజీబీ ఖాతాదారులకు కొత్త ఖాతా నంబర్లు

- ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ నవీన్‌కుమార్ వెల్లడి

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకును ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో సాంకేతికంగా విలీనం చేసే ప్రక్రియలో భాగంగా కొన్ని రకాల సేవలు అందించడంలో కొంతమేర జాప్యం జరుగుతోందని, వారం రోజుల్లో అన్నీ కొలిక్కి వస్తాయని రీజినల్ మేనేజర్ పీఎస్ నవీన్ కుమార్ తెలిపారు. ఖాతా నెంబర్ మారుతుందని, ఖాతాదారులు సంబంధిత బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించి కొత్త ఖాతా నెంబర్ పొందాలన్నారు. అయితే పాత ఖాతా నెంబరు ఆధారంగా పరిమిత కాలంపాటు నగదు లావాదేవీలు పొందవచ్చని సూచించారు. కొత్త ఖాతా నెంబరు ఆధారంగా యుపీఐ సేవలను తిరిగి నమోదు చేసుకోవాలన్నారు. ఐఎంపీఎస్/ఎన్ఈఎఫ్‌టీ/ఆర్‌టీజీఎస్ ద్వారా నగదు పొందడానికి కొత్త ఐఎఫ్ఎస్‌సీ కోడ్ 'యుబీఐఎన్0సీజీ7999' ఉపయోగించాలన్నారు. ఏపీజీబీ మణి యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని మొబైల్ బ్యాంకింగ్ సేవలు పొందవచ్చని తెలిపారు. బ్యాంకు సేవలు పొందడంలో ఎలాంటి సందేహాలున్నా 1800 425 6708 టోల్‌ఫ్రీ నెంబరుకు కాల్ చేయవచ్చన్నారు.

వెంటాడుతున్న యూరియా కొరత

- రబీ సీజన్‌కు 26,226 టన్నులు అవసరం
- 17 రోజులు గడిచినా ఒక్క టన్ను కూడా రాని వైనం
- ఆర్‌బీకేలు, ప్రైవేటు డీలర్ల వద్ద నిల్



కర్నూలు(అగ్రికల్చర్): రబీ సీజన్‌ను కూడా యూరియా కొరత వెంటాడుతోంది. సీజన్ అక్టోబరు 1 నుంచి మొదలైనప్పటికీ ఇంతవరకు ఒక్క టన్ను కూడా యూరియా వచ్చిన దాఖలాలు లేవు. అవసరమైనంత యూరియా ఉందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నా.. క్షేత్రస్థాయిలో బస్తా కూడా లభించని పరిస్థితి నెలకొంది. మార్క్‌ఫెడ్, కంపెనీ గోదాముల్లో 3,800 టన్నుల యూరియా ఉందని అధికారులు చెబుతున్నా.. ప్రస్తుతం ప్రైవేటు డీలర్లు, రైతుభరోసా కేంద్రాల్లో బస్తా యూరియా కూడా లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 51 వేల టన్నుల యూరియా అవసరం ఉండగా... కేవలం 34 వేల టన్నులు మాత్రమే వచ్చింది. యూరియా సరఫరాలో కూటమి ప్రభుత్వం చేతులెత్తేయడంతో గతంలో ఎపుడూ లేని విధంగా రైతులు ఇబ్బందులు పడ్డారు. బస్తా యూరియా ధర రూ.267 ఉండగా.. రైతులు బస్తా రూ.600 వరకు ధరతో కొన్నారు. ఖరీఫ్ సీజన్‌లో అవసరమైన మేర యూరియా సరఫరాలో విఫలమైన ప్రభుత్వం రబీ సీజన్‌పై దృష్టి పెట్టకపోవడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ సీజన్‌కు సంబంధించి 26,226 టన్నుల యూరియా అవసరమవుతుందని జిల్లా వ్యవసాయ యంత్రాంగం ప్రభుత్వానికి నివేదించింది. అయితే వ్యవసాయ శాఖ ఇంతవరకు సప్‌లై ప్లాన్ ఇవ్వలేదు. ఇంతవరకు ఒక్క టన్ను కూడా యూరియా సరఫరా చేయలేదు. రబీలో జిల్లాలో 1.10 లక్షల హెక్టార్లలో పంటలు సాగు అవుతాయి. వర్షాధారం కింద శనగ, వాము, నీటి ఆధారం కింద వేరుశనగ, వరి సాగు అవుతున్నాయి. కర్నూలు, ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు, గూడూరులో యూరియా ఎక్కడా లభించడం లేదు. ఆర్‌బీకేలు, ప్రైవేటు డీలర్ల దగ్గర యూరియా అనేదే లేకపోవడంతో మళ్లీ రైతులు రోడ్డెక్కే పరిస్థితి ఏర్పడుతోంది.

రాష్ట్ర నిధులతో బీజేపీ ప్రచారమా!

- జీఎస్టీ సభతో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదు
- సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి



నంద్యాల(అర్బన్): కేంద్రంలో అధికారంలో వున్న బీజేపీ ప్రచారం కోసం సూపర్ జీఎస్టీ సభ నిర్వహించినట్లుగా ఉందని, అందుకు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్ర నిధులను వినియోగించడం ఎంత వరకు సబబు అని సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి విమర్శించారు. రెండు రోజుల క్రితం కర్నూలు బహిరంగ సభలో సీమకు ప్రత్యేక ప్యాకేజీపై ఒక్క మాట కూడా ప్రస్తావించకపోవడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రాయలసీమ అభివృద్ధిపై ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుందన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. 8 ఏళ్లుగా ప్రజలపై భారంగా జీఎస్టీ పన్నులు విధించిన కేంద్ర ప్రభుత్వం తాజాగా స్వల్ప పన్ను తగ్గింపును ప్రజలకు లాభంగా ప్రదర్శిస్తూ జీఎస్టీ-2 వారోత్సవాలు చేసుకోవడం ప్రజలను మభ్యపెట్టడమేనన్నారు. ఈ ప్రచారం కోసం రాష్ట్ర ప్రభుత్వాన్ని వినియోగించుకోవడం, ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఏపీ ప్రభుత్వానికి మరింత భారంగా మారిందన్నారు. ఫలితంగా సీమ అభివృద్ధి కార్యక్రమాలు మరింత ఆలస్యమయ్యే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ప్రభుత్వం చేసిన మూడు తప్పిదాలతో ఇప్పటికే రాష్ట్ర పరిస్థితి దెబ్బతిందన్నారు. ప్రధాన మంత్రి పర్యటనకు రూ.వందల కోట్లు ఖర్చు చేస్తూ కూడా రాయలసీమ రైతులు, కూలీలు ఎదుర్కొంటున్న కరువు, నీటి కొరత, వలస సమస్యలను పీఎం దృష్టికి తీసుకెళ్లడంతో కూటమి నాయకులు విఫలమయ్యారన్నారు. లక్షలాది ప్రజల ఆకాంక్ష అయిన సిద్దేశ్వరం అలుగు నిర్మాణం, జాతీయ స్థాయి వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటుపై ప్రకటన రాకపోవడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రాయలసీమ పట్ల చిత్తశుద్ధి లేదని మరోసారి బహిర్గతమైందన్నారు.

గల్లంతైన విద్యార్థి శవమై తేలాడు





ఉదయ్ కుమార్ మృతదేహం, ప్రమాదం జరిగిన గుంతను పరిశీలిస్తున్న తహసీల్దార్

గోనెగండ్ల: గాజులదిన్నె ప్రాజెక్ట్ క్రస్ట్ గేట్ల సమీపంలో రెండు రోజుల క్రితం ప్రమాదవశాత్తూ నీటిలో పడి గల్లంతైన ఇంజినీరింగ్ విద్యార్థి శవమై తేలాడు. ఎమ్మిగనూరు పట్టణ శివారులోని సెయింట్ జాన్ ఇంజినీరింగ్ కాలేజీకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు గురువారం మధ్యాహ్నం గాజులదిన్నె ప్రాజెక్ట్ చూసేందుకు వెళ్లారు. ప్రాజెక్ట్ క్రస్ట్ గేట్ల దగ్గర పారుతున్న నీటిలో ఆడుతూ సెల్ఫీలు దిగుతుండగా చెన్నారెడ్డి, ఉదయ్ కుమార్ కాలు జారి నీటిలో మునిగిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు, రెవెన్యూ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మత్స్యకారులతో నీటి గుంతలో గాలించారు. అదే రోజు సాయంత్రం చెన్నారెడ్డి మృతదేహం లభ్యం కాగా శుక్రవారం ఉదయం ఉదయ్ కుమార్ శవమై కనిపించాడు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికు తరలించారు. ఎమ్మిగనూరుకు చెందిన గోవింద్, రాధ దంపతుల చిన్న కుమారుడు ఉదయ్ కుమార్(22) మూడో సంవత్సరం సీఈసీలో ఏఐ చేస్తున్నాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రుల రోదన పలువురిని కలిచివేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నీటి గుంత పరిశీలన..

గాజులదిన్నె ప్రాజెక్టు క్రస్ట్ గేట్ల సమీపంలో నీటి గుంతలో పడి ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు మృతి చెందిన విషయం తెలుసుకున్న తహసీల్దార్ రాజేశ్వరి శుక్రవారం సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ప్రాజెక్ట్ సందర్శనకు వచ్చిన ఇద్దరు విద్యార్థులు చెందడం బాధాకరమన్నారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రాజెక్టు క్రస్ట్ గేట్ల దగ్గర నుంచి పిల్లిగుండ్ల, ఒంటెడుదిన్నె గ్రామాలకు వెళ్లే వంతెన వరకు కంచె ఏర్పాటు చేసే దిశగా ఇరిగేషన్ ఎస్ఈకు నివేదిక పంపుతామన్నారు. ఆమె వెంట ఆర్ఐ రామయ్య, వీఆర్వోలు రాముడు, రంగారెడ్డి, ఎఫ్‌డీఓ మద్దిలేటి, ప్రాజెక్టు వర్క్ఇన్‌స్పెక్టర్ ఉగ్రనరసింహ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల అప్పగింత



తండ్రులకు అప్పగిస్తున్న ఎస్ఐ శివాంజల్

మంత్రాలయం రూరల్: దారి తప్పి మంత్రాలయం చేరుకున్న బెంగళూరు సిటీ క్రైస్ట్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులను పోలీసులు శుక్రవారం తల్లిదండ్రులకు అప్పగించారు. బెంగళూరుకు చెందిన మోహన్‌కుమార్ కుమారుడు విశాల్‌కుమార్ (8వ తరగతి), చిన్నప్ప కుమారుడు రంజిత్ (8వ తరగతి), మోహన్‌కుమార్ కుమారుడు తనీష్ (8వ తరగతి) కర్ణాటకలోని ధర్మస్థలం, మద్రాసు ప్రాంతాలను చూడాలని ఇంట్లో చెప్పకుండా.. అయితే ఏ బస్సు ఎక్కడికి పోతుందో తెలియకుండా మంత్రాలయం బస్సు ఎక్కారు. శుక్రవారం ఉదయం రాఘవేంద్ర సర్కిల్‌లో ఏడుస్తున్న విద్యార్థులను స్థానిక కానిస్టేబుల్ నాగేశ్వరరెడ్డి గమనించి స్టేషన్ తీసుకెళ్లారు. వివరాలు రాబట్టిన ఎస్ఐ శివాంజల్ తల్లిదండ్రులకు సమాచారం చేరవేసి తండ్రులు రాగానే పిల్లలను వారికి అప్పగించారు.

దీపావళికి బీఎస్ఎన్ఎల్ బంపర్ ఆఫర్లు

- జీఎం రమేష్



మాట్లాడుతున్న బీఎస్ఎన్ఎల్ జీఎం రమేష్

కర్నూలు(హాస్పిటల్): దీపావళి పండుగను పురస్కరించుకుని భారత సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) బంపర్ ఆఫర్లు తీసుకొచ్చిందని ఆ సంస్థ కర్నూలు బిజినెస్ జనరల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ జి.రమేష్ చెప్పారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పండుగ సందర్భంగా ఉచితంగా సిమ్‌తో పాటు కేవలం రూ.1 రీచార్జ్‌తో 30 రోజుల పాటు ప్రతిరోజూ 2 జీబీ డేటా, ఉచిత కాల్స్, 100 ఎస్ఎంఎస్‌లు అందిస్తున్నామన్నారు. ఈ ఆఫర్ 15వ తేదీ నుంచి నవంబర్ 15వ తేదీ వరకు ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా బీఎస్ఎన్ఎల్ పూర్తి స్వదేశీ సాంకేతికతతో తయారు చేసిన 4జీ సేవలను ప్రధాన మంత్రి మోదీ ఇటీవలే జాతికి అంకితం చేశారని గుర్తు చేశారు.

ఎఫ్‌టీటీహెచ్ సర్వీసులో అద్భుత ఆఫర్లు..

బీఎస్ఎన్ఎల్ భారత్ ఫైబర్ ఇంటర్నెట్ సర్వీసులో ఫెస్టివ్ ఆఫర్ కింద అద్భుతమైన స్పెషల్ డిస్కౌండ్‌లను ప్రవేశపెట్టిందన్నారు. ఫైబర్ బేసిక్ నియో 449 ప్లాన్, ఫైబర్ బేసిక్ 499 ప్లాన్ తీసుకున్న వారికి మొదటి నెలలో ఉచితంగా సర్వీసులు పొందిన తర్వాత మూడు నెలల వరకు రూ.50లు, రూ.100లు డిస్కౌంట్ అందిస్తున్నట్లు తెలిపారు.

సిల్వర్ జూబ్లీ ప్లాన్

ఎఫ్‌టీటీహెచ్ వినియోగదారులకు కొత్తగా సిల్వర్ జూబ్లీ ప్లాన్‌ను ప్రవేశపెట్టామన్నారు. ఈ ప్లాన్ కింద కేవలం రూ.625కే 75 ఎంబీపీఎస్ స్పీడుతో ఇంటర్‌నెట్, స్కైప్రో హిందీ ఫుల్ ఫ్యామిలీ మ్యాక్స్ హెచ్‌డీ ప్యాకేజీతో దాదాపు 475 టీవీ చానల్స్‌ను, సోనీ లైవ్ ప్రీమియం, జియో హాట్‌స్టార్ సూపర్‌ప్లాన్ ఓటీటీలను అదనపు చార్జీ లేకుండా అందిస్తున్నట్లు తెలిపారు.

లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులపై సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న బి.లీలా వెంకట శేషాద్రి

కర్నూలు(సెంట్రల్): లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి సమీక్షించారు. ఆయన శుక్రవారం న్యాయ సేవాసదన్‌లో సమీక్ష చేస్తూ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులు, చట్టపరమైన సలహాలు, జైళ్ల పర్యటనలు, కేసుల వివరాలు, పరిష్కారాలపై అధికారులకు వివరించారు. పలు కేసులకు సంబంధించి బెయిళ్లు ఇచ్చిన స్థితిగతులపై సమీక్షించారు. డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శివరాం, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఏ.సులోచన పాల్గొన్నారు.

మండలానికి ఒక స్వచ్ఛ రథం



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

కర్నూలు(అర్బన్): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల నుంచి పొడి వ్యర్థాలను స్వీకరించి వాటికి బదులుగా నిత్యావసర సరుకులను అందించేందుకు త్వరలో ప్రతి మండలానికి ఒక స్వచ్ఛ రథాన్ని ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక జెడ్పీ ప్రాంగణంలోని డీపీఆర్‌సీ భవనంలో పంచాయతీ కార్యదర్శులు, డిప్యూటీ ఎంపీడీఓలకు ఎల్ఎస్‌డీజీఎస్ థీమ్–5(క్లీన్ అండ్ గ్రీన్) అనే అంశంపై ఒక రోజు టీఓటీ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ గతంలో పాత వస్తువులను విక్రయించి సిల్వర్, ప్లాస్టిక్ వస్తువులను పొందే సంస్కృతి నుంచి పొడి వ్యర్థాలను గ్రామ పంచాయతీలకు అందించి అవసరమైన నిత్యావసర సరుకులను పొందేందుకు వీలుగా స్వచ్ఛ రథాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలన్నారు. అందులో భాగంగా ఈ నెల 18న చేపట్టనున్న స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. శిక్షణా కార్యక్రమంలో డీపీఆర్‌సీ జిల్లా కోఆర్డినేటర్ మంజులా వాణి, ట్రైనింగ్ మేనేజర్ గిడ్డేష్, టీఓటీలు ఆస్రఫ్‌బాషా, పి.జగన్నాథం పాల్గొన్నారు.

విధులు నిర్వహిస్తున్న ప్రాంతాల్లోనే నివాసం



సమావేశంలో మాట్లాడుతున్న కె.ప్రసూన

కర్నూలు(అర్బన్): వసతి గృహ సంక్షేమాధికారులు తాము విధులు నిర్వహిస్తున్న ప్రాంతాల్లోనే నివాసం ఉండాలని, అందుకు అనుగుణంగా చిరునామాలను తమ కార్యాలయంలో అందించాలని జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణి కె.ప్రసూన ఆదేశించారు. శుక్రవారం ఆమె తన చాంబర్‌లో సంక్షేమాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిర్ణీత సమయానికి ఆరోగ్య పరీక్షలు చేయించాలన్నారు. ప్రతి రోజు ఉదయం విద్యార్థులతో యోగా చేయించాలన్నారు. 10వ తరగతి పరీక్షల్లో గత సంవత్సరం కంటే ఈ ఏడాది మెరుగైన ఫలితాలు సాధించేలా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. బీసీ హాస్టళ్ల విద్యార్థులు కూడా ఐఐఐటీకి ఎంపికయ్యే విధంగా తర్ఫీదు ఇవ్వాలన్నారు. విద్యార్థులు, వసతి గృహ సంక్షేమాధికారులతో పాటు ఆయా వసతి గృహాల్లోని నాల్గవ తరగతి సిబ్బంది కూడా ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదు చేయాలన్నారు. ఆహార పదార్థాల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని, గడువు మీరిన వాటిని ఎట్టి పరిస్థితుల్లో ఉపయోగించరాదన్నారు. సమావేశంలో సహాయ బీసీ సంక్షేమాధికారులు ఆంజనేయులు నాయక్, ఎం.శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైభవంగా తిరుచ్చి మహోత్సవం



పల్లకీలో మద్దిలేటి స్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో ఆశ్వీయుజ మాసం శుక్రవారం రాత్రి స్వామి వారికి ఆలయ మాడవీధుల్లో తిరుచ్చి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉప కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు, వేదపండితులు స్వామి వారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం పల్లకీలో ఉంచి ఆలయ మాడ వీధుల్లో మంగళ వాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణల మధ్య ఆలయ ప్రదక్షిణ చేపట్టారు.

BRINDAVAN
INSTITUTE OF TECHNOLOGY & SCIENCE (BITS-KNL)
(Approved by ACITE, Affiliated to JNTUA)
NH-44 Peddatekur, Kurnool-518218, A.P.
WWW.bitskurnool.edu.in

B.Tech, Category-B Admissions
for the Academic year 2025-26
SEATS : Civil-09, ECE-09, EEE-09, CSE-36, Mechanical-09

Applications can be obtained/download from the college/website. The filled in Application along with registration fee of Rs.1500/- (either by cash paid in college office or DD in favour of principal, BITS, Payable at Kurnool) and enclosures should be submitted by Regd. Post/in person in the college office during working hours, on or before 26-10-2025. Seats will be filled as per APSCHE Guidelines. Counseling Code: BRNK. SECRETARY

షార్ట్ సర్క్యూట్‌తో మెడికల్ దుకాణం దగ్ధం



దగ్ధమైన మెడికల్ షాపు

డోన్ టౌన్: పట్టణంలోని ఇందిరానగర్ సమీపంలోని మదీనా క్లినిక్ మెడికల్ షాపు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. శుక్రవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి పొగలు బయటికి వస్తుండటంతో స్థానికులు గమనించి క్లినిక్ యజమాని ఆర్ఎంపీ డాక్టర్ మౌలాలికి సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న బాధితుడు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చాడు. అయితే గురువారం ప్రధాని కర్నూలు పర్యటన నిమిత్తం డోన్ ఫైర్ ఇంజిన్ అందుబాటులో లేదు. కర్నూలు నుంచి వచ్చే లోపు షాపు మొత్తం దగ్ధమైంది. ఈ ప్రమాదంలో మందులు, ఫ్రిడ్జ్, ఏసీ, ల్యాప్‌ట్యాప్ తదితర విలువైన వస్తువులు కాలిపోవడంతో రూ. లక్షల్లో నష్టం ఏర్పడినట్లు బాధితుడు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

EDUCATION & TRAINING

■ మౌనికా పారా మెడికల్ కాలేజ్, డిప్లొమా ఇన్ ఆప్తాల్మిక్ అసిస్టెంట్ కోర్సు. 8317680122 [HA-16728]

WANTED

■ Wanted Male Wardes, Female Wardens, Cooks and Workers for Residential Jr. College, Kurnool. Contact. Cell No.: 85007 80180. [SCA25009036]

■ కస్టలైట్స్ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను.జీ:15 వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.9014885406 [HA-642]

■ Work from home మా కంపెనీ అడ్వర్టైజ్మెంట్లు మీ మొబైల్ ద్వారా పార్ట్ టైం పంపుటకు స్త్రీ/పు. కావలెను. వారానికి 3,500. వివరాలకు వాట్సాప్‌లో hi అని మెసేజ్ పెట్టి కాల్ చేయండి 82478 08801 [SCA25008982]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
70750 09185
70750 09165

ఆడపిల్లల శాతం తగ్గడం ఆందోళనకరం



మాట్లాడుతున్న పీసీ పీఎన్‌డీటీ నోడల్ అధికారి డాక్టర్ ఉమ

కర్నూలు(హాస్పిటల్): సమాజంలో ఆడపిల్లల శాతం తగ్గడం ఆందోళనకరమని పీసీ పీఎన్‌డీటీ నోడల్ అధికారి డాక్టర్ ఉమ అన్నారు. స్థానిక ఎ.క్యాంపులోని మెరిడియన్ యూపీహెచ్‌సీలో అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, కుటుంబ సభ్యులకు ఆడపిల్లల ప్రాముఖ్యత గురించి వివరించారు. ప్రతి కుటుంబానికి ఆడబిడ్డ ఆణిముత్యమని, వారిని కాపాడి ప్రోత్సహించాలని సూచించారు. మాస్ మీడియా అధికారి ప్రకాష్‌రాజు మాట్లాడుతూ గర్భస్థ పూర్వ, గర్భస్థ పిండ ప్రక్రియ నిషేధ చట్టం నిబంధనలను వివరించారు. సమాజంలో స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమేనని, వారి మధ్య ఎలాంటి వివక్ష ఉండకూడదన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ, విద్యాధికారి బాబా ఫక్రుద్దీన్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాధవి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

మోదీ పర్యటనతో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు

- సమస్యలను వివరించడంలో సీఎం, డిప్యూటీ సీఎం విఫలం
- సీపీఎం, సీపీఐ నాయకుల విమర్శ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

కర్నూలు(సెంట్రల్) : ప్రధానమంత్రి నరేంద్రమోదీ కర్నూలు పర్యటనతో రాష్ట్రానికి రూ.350–400 కోట్లు ఖర్చు వృథా తప్పా ఒరిగిందేమీ లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ విమర్శించారు. రాష్ట్ర సమస్యలను ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విఫలమ్యారన్నారు. శుక్రవారం సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్ జీఎస్టీ..సూపర్ సేవింగ్స్ అంటూ సభలో చంద్రబాబునాయుడు, లోకేష్ మోదీ భజన చేశారని, చంద్రబాబు 25 సార్లు, లోకేష్ తండ్రిని మించిన తనయుడిగా 35 సార్లు మోదీ జపం చేశారన్నారు. రాష్ట్రానికి ప్రధాన మంత్రి వచ్చారంటే అభివృద్ధి పనులకు నిధులను డిమాండ్ చేయాల్సి ఉన్నా ఆ పని చేయలేదన్నారు. విశాఖ స్టీలు ప్లాంటును బలోపేతం చేశామని తండ్రి, కొడుకులు చెప్పుకోవడం ప్రజలను మోసం చేయడమే అవుతుందన్నారు. పార్లమెంట్ సాక్షిగా విశాఖ స్టీలు ప్లాంటును ప్రైవేటీకరణ చేస్తామని స్వయంగా మోదీనే చెప్పింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పీఎస్ రాధాకృష్ణ, జి.రామకృష్ణ, ఎండీ ఆనంద్‌బాబు, టి.రాముడు, ఎండీ అంజిబాబు, ఓల్డ్‌సిటీ కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.

విభజన హామీల ప్రస్తావన ఏదీ..?

కర్నూలులో జరిగిన మోదీ సభలో విభజన హామీల ప్రస్తావన లేకపోవడం తీవ్ర అన్యాయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.రామాంజనేయులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా, అత్యంత వెనుకబడిన రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు విషయాలపై ఎవరూ మాట్లాకపోవడం మోసం చేయడమేనన్నారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు ఒకరినొకరు పొగుడుకోవడానికే సభను నిర్వహించినట్లు ఉందన్నారు. అధికార దుర్వినియోగంతో భయపెట్టి పొదుపు, జీ ఎస్టీ వ్యాపారులు, ఉపాధి కూలీలను సభకు రప్పించారని విమర్శించారు. అధికారంలోకి వస్తే న్యాయం చే స్తామని సుగాలి ప్రీతిభాయ్ కుటుంబానికి హామీ ఇచ్చి న పవన్ కల్యాణ్..సుగాలి పార్వతీని బయటకు రాకుండా గృహ నిర్బంధం చేయడం దారుణమన్నారు.